

# ఊసులే

**దాదాపు అర్ధరాత్రి దాటింది. వెన్నెల విరగగాస్తుంది. మోదుగు చెట్ల మధ్య కాలిబాటపై రవీంద్ర నడుస్తున్నాడు. అప్పుడప్పుడు బొయ్యిన గాలివీస్తోంది. ఆ గాలికి మోదుగుచెట్లు ఫెళఫెళమంటూ, కీచుకీచుమంటూ రొదచేస్తూ ఊగుతున్నాయి. రవీంద్ర తల నిండా ఆలోచనలు ముసురుకుంటున్నాయి.**

ఊళ్లోకి బస్సుంది. అయినా తనకి ఈ బాటపైన నడిచి వెళ్ళడమంటే యిష్టం. ఈ కాలిబాటతో తనని పెనవేసుకున్న అనుబంధం అలాంటిది. ఎందుకో ఈ రోజు-ఈ వెన్నెల, ఈ బాట తనకు విషాదంగా అన్పిస్తున్నాయి.

పావని గుర్తొచ్చింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రవీంద్ర గుండెల్నెవరో మెలి తిప్పుతున్నట్టు బాధ. తనింక నడవలేడు. పొద్దట్నించి ఏడ్చి, ఏడ్చి అలసిపోయాడు. బాట పక్కగానున్న చిన్న గుండుపై కూలబడ్డాడు రవీంద్ర. పదేళ్ళ క్రితంనాటి కలగాపులగమైన జ్ఞాపకాలు ఒకటొకటే విచ్చుకుంటున్నాయి.

** ** **

ఇంటర్ నుంచి పావని తనకు తెలుసు. యౌవనారంభ రోజుల్లో మొగలి పూల వానలో తనను చుట్టేసేది పావని. చదువు మీది వెర్రివ్యామోహంతో, ఆ మొగలిపూల మత్తును ఎన్నిసార్లు విదిల్చుకున్నాడో! ఇంటర్‌లో ఆమె తనకి జూనియర్. ఫ్రెషర్స్ పార్టీలో పరిచయమయ్యింది. "మనసున మల్లెల మాలలూగెనే- కన్నుల వెన్నెల జోలెలూగెనే!" ఆమె కమ్మని కంఠం నుంచి జాలువారిన పాట, తనను నిలువెల్లా చుట్టేసింది. నవ్వితే సొట్టలుపడే ఎర్రటి బుగ్గలు, పచ్చపువ్వుల వెన్నెల్లా వికసించే ముఖం. గలగలా నవ్వుతూ పరుగెత్తే సెలయేరులా ఉండేది పావని.

పావని జ్ఞాపకం రవీంద్రకు ఒళ్ళంతా పాకింది. గుండెదడ పెరిగింది. "మీ పాట చాలాబావుంది, బాగా పాడారు" ముందుగా తానే పలకరించాడు.

"మీ స్పీచ్ చాలాబావుంది. మిమ్మల్ని ఊళ్లో చాలాసార్లు చూసాను" అంది పావని.

ఇద్దరిది ఒకే ఊరు కావడంతో అలా మొదలైన పరిచయం త్వరలోనే స్నేహంగా మారింది.



పగడాల నాగేందర్

నల్లగొండకు ఆరు కిలోమీటర్ల వాళ్ళ ఊరు. ఒక కిలోమీటర్- అడ్డరోడ్డు మీద బస్టాప్ వరకు నడిచేవాళ్ళు. ఊళ్ళో పదవతరగతి పూర్తయ్యాక, ఇంటర్‌కైనా, డిగ్రీకైనా నల్లగొండకు వెళ్ళక తప్పేది కాదు. కాలేజీవెళ్ళే వాళ్ళంతా- జట్లు, జట్లుగా ముచ్చట్లాడుతూ ఆ అడ్డ రోడ్డు మీదిగానో, కాలిబాటలమీదిగానో వెళ్ళడం ఎంతో మధురంగా ఉండేది. కాలేజి కబుర్లు, సినిమాలు, రహస్యపు ప్రేమ ముచ్చట్లు, అర్థంకాని- అమ్మాయిల క్రీగంటి చూపులు, వాల్జెడలతోపాటు ఊగే జడగంటలు, రంగురంగుల నవ్వులు, పచ్చని చెట్ల మీద వాలిన పిట్టల్ని రాళ్ళతో కొట్టడం, అమ్మాయిలు వద్దని వారించడం... పొద్దుటిపూట ఆ దారంతా తొణికిసలాడే యౌవన తుళ్ళింతలతో వింత సోయగాలు పోయేది. అందుకే ఆ దారంటే రవీంద్రకెంతో యిష్టం. పావని, తాను ఆ దారంటే నడుస్తూ రహస్య ప్రేమల్లో ఎన్నిసార్లు మునిగామో! అని అనుకున్నాడు.

ఆ సన్నని తెల్లని నడుము మీద చేయి వేసి, పొదివిపట్టుకొని నడుస్తూ... ముచ్చట్లాడుతుంటే... తనకీ ప్రపంచాన్నే జయించినట్లు అన్పించేది.

ఎంత మధురంగా ఉండేవి ఆ రోజులు. రవీంద్రకు తన ఊరు గుర్తొచ్చింది. చనిపోయిన అమ్మ గుర్తొచ్చింది. తనకిప్పుడు పరాయిదైపోయిన ఆ ఊరి వాతావరణం గుర్తొచ్చింది. కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. బీరతీగల్లా, పొట్ల పాదుల్లా అల్లుకుపోయిన ఆ సంబంధాల మధ్య, వావివరుసల మధ్య ఆప్యాయంగా తాను ఆనాడు అల్లుకుపోయాడు. ఆ అనురాగాలన్నీ శాశ్వతమనుకున్నాడు. మల్లెతీగలా పెనవేసుకుపోయిన పావనితో ప్రేమ శాశ్వతమనుకున్నాడు. ఆ తల్లి పేగుబంధాల నుంచి, అమాయక ప్రేమల నుంచి క్రమక్రమంగా తనని దూరం చేసింది ఎవరు? రవీంద్రకు ఇప్పటికీ ఇది అర్థంకాని ప్రశ్నే!

చదువుమీద విపరీతమైన వ్యామోహంతోనే తాను ఊరు విడిచాడా?!, మనసు అంతరాంతరాలలో మరేదో జీవితం మీద తనకి కాంక్ష ఉందా?, కాంతులీనే నగర జీవితం తనని ఊరించిందా? అది ఏదీ అర్థంకాని వయస్సు. దీపపు కాంతిని చూసి ఎగిరొచ్చిన మిణుగురులా తను నగరం వైపు ఆకర్షింపబడ్డాడు. దీపం కింద కదలాడే క్రీనీడలో కీడును పసిగట్టలేకపోయాడు. అల్లుకుపోయిన ఆ ప్రేమ చేతుల్ని విదిల్చుకొని, తానానాడు నిర్దాక్షిణ్యంగా పట్నం బస్సెక్కాడు. బస్సు కిటికీలోంచి- ఊరికి దూరమవుతున్న తనకి, జామచెట్టు పక్కన నిల్చొని, కళ్ళనిండా నీళ్ళతో చేతులూపుతున్న పావని దీనమైన రూపం ఇప్పటికీ గుర్తుంది.

రవీంద్రకు తను ఇంటర్ ఫైనల్ పాసైన రోజు జ్ఞాపకం వచ్చింది. తెల్లవారు ఝాము మనకచీకట్లలోనే- పావని పేపర్ పట్టుకొని, 'కంగ్రాట్స్' అంటూ ఇంటికొచ్చింది. పెద్ద డాక్టర్‌వి కావాలంటూ ఎన్ని తీయని కబుర్లు చెప్పిందో! తను ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. ఎలాగైనా సరే ఎమ్సెట్ కోచింగ్‌కెళ్ళాల్సిందే! అనుకున్నాడు. కాని, తన ఆశ నెరవేరలేదు. ఇంట్లో పెండ్లికెదిగిన అక్కయ్యలు; చేతిలో నయాపైసలేదు, ససేమిరా వీలుకాదన్నాడు నాన్న. ఆ రోజంతా తిండిమానేసి, తానలిగి వెళ్ళిపోయాడు. మనసులో ఉబికివస్తున్న దుఃఖాన్నాపుకుంటూ పానగల్లు పాత దేవాలయాలలో తిరిగాడు.

తమ ఊరికి నాలుగు కిలోమీటర్ల పానగల్లు. అది దాటితే నల్లగొండ. రవీంద్రకు వయసొచ్చినప్పట్నించి సుఖానికైనా, దుఃఖానికైనా- ఆ పానగల్లే ఆశ్రయం. అది తమకొక పిక్నిక్‌స్పాట్. దుఃఖం ముంచెత్తినప్పుడు ఆ పాత రాతి శిథిలాల మధ్య కూచుంటే ఎంతో ఓదార్పు. పావనితో ఆ గుళ్ళో ఎన్నిసార్లు తిరిగాడో! తమ మధ్య ప్రేమ మొలకలేసిందక్కడే!

** ** **

ఆరోజు మహాశిరాత్రి. పానగల్లే కాదు, ఆ చుట్టుపక్కల ఊళ్లవాళ్ళంతా ఆ రోజు అక్కడే కన్పిస్తారు. తన క్లాస్‌మేట్ కిరణ్‌తో కలిసి గుడికొచ్చాడు రవీంద్ర. ఆశగా రవీంద్ర కళ్ళు ఎవరికోసమో వెతకడం కిరణ్ గమనించకపోలేదు. దూరంగా వస్తూ కన్పించింది పావని. థిక్ బ్లూ కలర్ లంగా, అదే కలర్ జాకెట్ పైన ఎరుపు వోణి. అందం మిడిసిపడుతూ వుంది. తలారా స్నానం చేసిందనడానికి గుర్తుగా కురులు చిరుగాలికి సుతారంగా ఊగుతున్నాయి. అమాయకత్వం తొణికిసలాడే మోము. ఒక్కసారిగా తనను తాను మరిచాడు రవీంద్ర. స్నేహితురాళ్ళ మధ్య తనో దేవకన్యలా నడుస్తోంది పావని. తనని చూడడంతో ఆ మోములో విరిసిన నవ్వు, సిగ్గుతో కను రెప్పలను అందంగా రెపరెపలాడిస్తూ, మూగగా చూస్తూ వెళ్ళింది పావని. అది గమనించిన కిరణ్ ఈ కరణమోళ్ళ పిల్లతో కథ ఎంతకాడికొచ్చింది? అన్నాడు. ఇంకా ఏం ముందుకు సాగట్లేదురా! అన్నాడు రవీంద్ర.

"ఈరోజు చెరువుగట్టుకు పిల్వరాదు" అన్నాడు కిరణ్.

"అమ్మో! వస్తుందా?" ధైర్యం చాల్లేదు రవీంద్రకు.

కొద్దిసేపు తటపటాయించి ఎలాగైనాసరే ధైర్యం చేయాలనే అనుకున్నాడు రవీంద్ర.

గుడిలోపల విపరీతమైన జనం. స్నేహితుల మధ్య తోసుకుంటూనే గర్భగుడి దాకా వెళ్ళింది పావని. అదే

అమ్మ చనిపోయి మూడేళ్ళయ్యింది. ఉన్న పొలం, ఇల్లు నాన్న అక్కల పెండ్లిళ్లకు అమ్మేశాడు. దాదాపుగా తాము ఊరు నుంచి వెళ్ళిపోదామనుకుంటున్న రోజులు. నాన్న ముఖంలో కనిపించని దైన్యం. కలసిరాని వ్యవసాయం. పొలం అమ్మినరోజుల్లో నాన్న ఒంటరిగా లేచి కూర్చొని అర్ధరాత్రులు చీకటిలో నిశ్శబ్దంగా ఏడవడం తనకింకా గుర్తుంది. ఓదార్చే తోడులేక నాన్న రోజురోజుకీ ఒంటరివాడౌతూ కుమిలిపోవడం తనకి తెలుస్తూనే వుంది. అయినా తనేం చేయలేడు. అక్కడ నగరంలో తానూ ఒంటరివాడే! చాలీచాలని స్కాలర్‌షిప్పు. ఎటు తీసుకెళుతుందో తెలియని చదువు. ఆ సంక్షోభ జీవితంలోంచే తాను పావనితో మాట్లాడాడు.

'పావని, నేను మొత్తంగా హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. బాగా చదువుకొని ఏదో ఒకటి కావాలి' తనకేవో రంగు రంగుల కలలు.

'నన్నూ తీసుకెళ్ళు రవీ! నేనీ ఊళ్ళో ఉండలేను. ఇంట్లో బావను చేసుకొమ్మని ఒత్తిడి ఎక్కువైంది' ఏడుపు మిళితమైన గొంతుతో పావని.

ఇప్పుడా? నిన్నా! అయినా నేను నిన్ను తీసుకపోతే ఆ కరణమోళ్ళపిల్ల, కాపోనితో లేచిపోయిందని, ఊరంతా కోడై కూస్తది తెల్సా?

"కూయనీ! నేను నీతోనే ఉంటా! నేను లేకుండా బతకలేనన్నావు, ఇవ్వాళ- నీ చదువు, నీ పట్నం బతుకే నువు చూసుకుంటున్నవ్" నిందించినట్లుగా అంది పావని.

"నేనే హైదరాబాద్‌ల కష్టంగా బతుకుతున్న, ఇప్పుడు నిన్ను తీసుకపోలేను, అర్థంచేసుకో!" మనసులో బాధగా వున్నా పైకి ఉన్న మాటన్నాడు తను.

పావని వెక్కివెక్కి ఏడ్చింది. తన చేతులతో నా గుండెలమీద కొట్టింది. ఏడుస్తూనే భారంగా జుత్తు పీక్కుంది. ముఖం తుడుచుకుంది. ఏదో మనసులో నిర్ణయించుకున్నదానిలా ఒక్కసారిగా లేచి నిలబడింది.

"నీకు చదువు కావాలి, ఉద్యోగం కావాలి, నగర జీవితం కావాలె- నేనొద్దు, జీవితంలో నీ ముఖం నాకు చూపించకు" అంటూ... చేయి పట్టుకున్నా విదిల్చుకొని, ఏడుస్తూ వెళ్ళిపోయింది పావని.

తన పి.జి పూర్తయ్యేనాటికి పావనికి వాళ్ళ బావతో పెండ్లయ్యింది. ఏడాది తిరక్కుండానే కొడుకునుకంది. తాను ఊరికి రావడం దాదాపుగా మానేశాడు. ఎప్పుడైనా బతుకమ్మ పండుగకో, సంక్రాంతికో వస్తే- ఎదురువడేది పావని, ఎముకలు తేలిన ముఖంతో జీవంలేని కళ్ళతో బతికున్న శవంలాగా!

"బాగున్నావా?" అంటే,

"నాకేం! చాలా బాగున్నా!" అనేది బింకంగా. ఆ మాటల వెనుక కనపడని వేదనేదో తొంగి చూస్తున్నట్లుగా అన్పించేది తనకి.

బదులుగా తనని "పెండ్లెప్పుడు జేసుకుంటవ్?" అని అడిగేది. తాను నవ్వేసి ఊరుకునేవాడు.

రవీంద్ర జ్ఞాపకాలలోంచి తేరుకొని వాస్తవంలోకి వచ్చాడు. చుట్టూ చూశాడు. ఈరోజు తాను చూసిన సంఘటనలు, విధి కత్తులను దూసిన వైనం గుర్తుకొచ్చింది రవీంద్రకు.

**తానీరోజు ఏవీ తినలేదు. కడుపులోనుంచి దవ తన్నుకొస్తుంది. కళ్ళు తిరు గుతున్నాయి. ముఖం రుద్దుకున్నాడు రవీంద్ర. కన్ను మూసినా, తెరిచినా కళ్ళలో కదలాడుతోంది పావని రూపం. అప్పటి ఆ అందమైన నవ్వు, ఇప్పుడీ నల్లగా మాడిపోయిన పావని ముఖం, ఆనాడు చితిమీద బోర్లాపడవేసిన తన అమ్మ బొమికుల గూడుదేహం, బిగ్గరగా ఏడుస్తున్న పావని కొడుకు పసి ముఖం, ఒక్కటొక్కటిగా గుర్తుకొస్తూ... రవీంద్రను ఉక్కిరిబిక్కిరి చేశాయి.**



దాదాపు ఏడాది తరువాత నుకుంటా తానీ ఊరొచ్చాడు. అదీ కిరణ్ పెళ్ళి కుదిరిందని తెలిసి. గత మూడు నాలుగేండ్లుగా తాను పూర్తిగా హైదరాబాద్‌వాసి అయిపోయాడు. నగర జీవితపు యాంత్రికతలో తానెక్కడున్నాడో తనకి తెలియదు.

ఊళ్ళో బస్ దిగగానే కిరణ్ చెప్పాడు- "నిన్న పావని కాల్చుకొని చనిపోయిందని" రవీంద్ర కాసేపటి వరకు మనిషి కాలేకపోయాడు. చలిపిడుగు మీద పడ్డట్టుగా వణికిపోయాడు. అలాగే బస్‌స్టాప్‌లో చాలాసేపు కూర్చొండిపోయాడు. రవీంద్రకు గుబగుబ కళ్ళలో నీళ్ళూరినాయి. గొంతు పెగలలేదు. మనసంతా నీళ్ళు నీళ్ళయిపోయింది. తన అమ్మ చనిపోయినప్పట్లా ప్రపంచమంతా శూన్యంలా అన్పించింది.

కిరణ్ చెప్పుకుపోతున్నాడు- "ఉన్నారే గదాని ఆళ్ళ బావకిచ్చిజేసింద్రు గదా! ఆడు వి.ఇ.ఓ. అయినంక బాగా తాగుడు నేర్చిండు. రోజూ తాగుడు, తన్నుడే నాయె! పైగా ఆడికి ఎక్కడలేని అనుమానం, పెండ్లాంమీద! పెండ్లప్పుడిచ్చిన కట్నం సరిపోలేదని ఇంకా తెమ్మని వేపుకు తిన్నాడురా? మేం చాలాసార్లు చెప్పిచూసినం! అయినా మనిషి మారలేదు." రవీంద్ర ముఖంలోకి ఓసారి చూసి చెప్పసాగాడు.

"పావం తల్లిగారేమో ఉన్నదంత కట్నంకింద ఊడ్చిచ్చిరి. ఇంకేడ్కెల్లి తెస్తరు. అటు అత్తింటికి, ఇటు తల్లింటికి మధ్య నలిగిపోయిందిరా పావని! ఇజ్జత్‌గల్ల మనిషాయె! నిన్న మద్యానం కాల్చుకుందని నల్లగొండ ఆసువత్రికేసుకపోయింద్రు. ఆడ్నే సచ్చిపోయిందట! రాత్రి శవాన్ని తీసుకొచ్చింద్రు. ఊరంతా కళ్ళనీళ్ళెట్టుకుంటూంది. అత్తగారోళ్ళే కాల్చి సంపింద్రని పావనోళ్ళ అన్నంటుండు, కట్నం పైసలు తిరిగిచ్చేదాక పీనుగను తీసేదిలేదంటూ... అత్తగారింటి ముందు శవాన్ని బెట్టి లొల్లి జేసుంద్రు, శవాన్ని జూస్తావా?" అడిగాడు కిరణ్.

రవీంద్ర శక్తినంతా కూడగట్టుకొని కిరణ్‌తో నడిచాడు. వాకిట్లో చాపేసి ఐస్‌గడ్డల మధ్య శవాన్ని ఉంచారు. పాల మీగడలా, వెన్నెల తరగల్లా, ముట్టుకుంటే మాసిపోయిసట్లుండే పావని శరీరం, నల్లగా మాడిపోయి, ముఖం గుర్తుపట్టి, గుర్తుపట్టనట్లు వికృతంగా కాలింది. చూస్తున్న రవీంద్రకు ఒక్కసారిగా దుఃఖం పొంగుకొచ్చింది. శవం పక్కన మూడేండ్ల పావని కొడుకు "అమ్మా! అమ్మా!" అంటూ బిగ్గరగా ఏడుస్తున్నాడు. ఆ పిల్లాడిని గుండెలకు హత్తుకుంటూ ఏడుస్తున్న పావని తల్లి. ఆ హృదయ విదారక శోకాన్ని చూడలేక రవీంద్ర తలతిప్పుకున్నాడు. ఒక్కసారిగా పావని ముఖాన్ని చేతుల్లోకి తీసుకొని బిగ్గరగా ఏడ్వాలని మనసు తొక్కిసలాడింది- రవీంద్రకు! అక్కడుంటే తనేం చేస్తాడో తనకే తెలియదు. అందుకే కిరణ్‌కి కూడా చెప్పకుండా వెనుదిరిగి వడివడిగా నడుచుకుంటూ ఊరుదాటాడు రవీంద్ర. తను, పావని కలిసి తిరిగిన ప్రతిచోటల్లా పిచ్చివాడిలా తిరిగాడు. ఆ కాలిబాట, ఆ అడ్డరోడ్డు, బస్‌స్టాప్, పొలగల్లు పాతదేవాలయాలు, చెరువుగట్టు ప్రతిచోట వెర్రిగా దేనికోసమో వెతుక్కున్నాడు రవీంద్ర. తిరిగితిరిగి అలసిపోయాడు. రాత్రయ్యింది, ఊరి దారి పట్టాడు రవీంద్ర.

తానీరోజు ఏవీ తినలేదు. కడుపులో నుంచి దవ తన్నుకొస్తుంది. కళ్ళు తిరుగుతున్నాయి. ముఖం రుద్దుకున్నాడు రవీంద్ర. కన్ను మూసినా, తెరిచినా కళ్ళలో కదలాడుతోంది పావని రూపం. అప్పటి ఆ అందమైన నవ్వు, ఇప్పుడీ నల్లగా మాడిపోయిన పావని ముఖం, ఆనాడు చితిమీద బోర్లాపడవేసిన తన అమ్మ బొమికుల గూడుదేహం, బిగ్గరగా ఏడుస్తున్న పావని కొడుకు పసిముఖం, ఒక్కటొక్కటిగా గుర్తుకొస్తూ... రవీంద్రను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఓదార్చడానికి ఎవరయినా వుంటే బావుండును. అమ్మ చల్లని చేయి, పావని వెచ్చని ఒడి- మళ్లీ దొరికినా బావుండును. కనీసం ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళి, పెద్దగా భోరుమని ఏడవనన్నా ఏడిస్తే బావుండును. మనసులోంచి ఈ బరువు దిగిపోవును అనుకున్నాడు రవీంద్ర.

పావని శవాన్ని తీసుంటారా?! లేక కట్నం డబ్బులు తిరిగిచ్చేదాకా శవాన్ని తీసేదిలేదంటూ వాళ్ళన్న భీష్మించుక్కూర్చున్నాడా! ఈ చలిలో ఆ ఐస్‌గడ్డల మధ్య పావని శవం అలా ఉబ్బిపోతుందా? రవీంద్రకు మనసంతా వికారంగా అన్పించింది.

శూన్యంలోంచే ఆలోచనలు సాగుతున్నాయి రవీంద్రకు. ఈ ఊరి నుంచి, అమ్మ నుంచి, పావని నుంచి తనని వేరు చేసినప్పుడే నీరులేని భూమిమీద కొట్టుకుంటున్న చేపపిల్లలా తాను విలవిల్లాడాడు. దిక్కుతోచని ఒంటరితనంలో, మనుషుల ప్రేమలు, సుఖదుఃఖాలు లేని బూడిదరానుల వెన్నెలలో తానిప్పుడు చిక్కుకుపోయాడు. ఏదో మెలమెల్లగా అర్థమవుతున్నట్లుగా అన్పించింది రవీంద్రకు. బతికినంతకాలం ఈ వేదనను తాను మోయాల్సిందే!

పావని శవాన్ని చూసి తాను వెనుదిరిగినప్పుడు, శవం దగ్గర మూగిన జనసమూహంలోంచి ఎవరో ఆడమనిషి బాధతో నిండిన గొంతుతో తిట్టడం గుర్తొచ్చింది రవీంద్రకు. "బంగారంలాంటి పిల్ల, బతుకు సర్వనాశనం జేసింద్రు! ఆ పిల్ల ఉసురు తగిలి ఆళ్ళు కూడా సర్వనాశనమయిపోతరు"- ఆ మాటలు తననింకా వెంటాడుతున్నయ్! అవును, పావని చావుకు తను కారణం కాదా?! తనకా ఉసురు తగలకపోదు. తనింక హాయిగా బతకలేడు. ఇలా భరింపరాని గుండెకోతతో తను నిరంతరం చావాల్సిందే! మొదలూ చివరలేని ఆలోచనలతో రవీంద్ర శూన్యంలోకి చూస్తూ అలా కూర్చొండిపోయాడు. నిండుగా పేరుకుపోయిన విషాదంతో రవీంద్ర మనసంతా పొగకమ్ముకుంది. ●